క్లుప్తంగా

నేడు ఇఫ్తార్

కడప కల్చరల్: కడప నగరంలో శనివారం సాయంత్రం 5.30 గంటలకు ఇఫ్తార్ విందు నిర్వహించనున్నారు. ఉలేమా అయిమ్మ కమిటీ ఆధ్వర్యంలో 'దావతె ఇఫ్తార్' పేరిట ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఆ కమిటీ అధ్యక్షుడు మౌలాన సయ్యద్ నిజాముద్దీన్ బుఖారి, కార్యదర్శి ముఫ్తీ సయ్యద్ సలీం బుఖారి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని కడప నగరం రహమతుల్లావీధిలో ఇఫ్తార్ కార్యక్రమం ఉంటుందని, అంతకు ముందు ఉలేమా అయిమ్మ కమిటీ నూతన కార్యాలయాన్ని ప్రారంభిస్తామని తెలిపారు. ముఖ్య అతిథిగా ఉప ముఖ్యమంత్రి అంజద్ బాష పాల్గొంటారని, పలువురు మత గురువులు, ముస్లిం ప్రముఖులు, ఉలేమాలు, అయిమ్మలు, మౌల్వీలు, ముఫ్తీలు కూడ కార్యక్రమంలో పాల్గొంటారని వివరించారు.

బియ్యం ప్యాకెట్ పంపిణీ

కడప కల్చరల్ : నగరానికి చెందిన ప్రముఖ ఫొటోగ్రాఫర్ రాయల్ రషీద్ సంస్మరణగా ఆయన కుమారుడు షబ్బీర్ శుక్రవారం అనాథలకు బియ్యం ప్యాకెట్ అందజేశారు. కడప నగరం ఆర్అండ్‌బీ అతిథి గృహం వద్దగల ప్రేమాలయ వసతి గృహంలో బియ్యం ప్యాకెట్లతోపాటు పండ్లు పంపిణీ చేశారు. రాయల్ రషీద్ కుటుంబ సభ్యులు, వసతి గృహం మేనేజర్ శ్రీనివాసులురెడ్డి, సిబ్బంది రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

10 నుంచి నడివీధి గంగమ్మ వార్షికోత్సవం

కడప కల్చరల్ : కడప నగరం హనుమప్పవీధిలోని నడివీధి గంగమ్మ క్షేత్రం మూడవ వార్షికోత్సవం ఈనెల 10 నుంచి 14 వరకు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు గోపాల్‌సింగ్, ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. శుక్రవారం సంస్థ కార్యాలయంలో ఆయన కార్యక్రమ వివరాలు తెలిపారు. 10న ఉదయం 5 గంటలకు అమ్మవారికి చల్ల సమర్పణ, 8 గంటలకు వైవీ స్ట్రీట్ పాండురంగస్వామి ఆలయం వద్దనుంచి షష్టిపూర్తి జరుపుకునే దంపతులను పూర్ణకుంభంతో నడివీధి గంగమ్మ క్షేత్రానికి ఊరేగింపుగా తీసుకు రానున్నట్లు తెలిపారు. 11న పుణ్య జలాల ఊరేగింపు, చండీహోమం, రాహుకాల పూజ నిర్వహిస్తామన్నారు. 12న అమ్మవారి క్షేత్రం వెలిసిన శుభ సందర్భంగా ఉదయం ముత్తయిదువులకు వడిబియ్యం కార్యక్రమం, సాయంత్రం భక్తులు అమ్మవారికి వడిబియ్యం సమర్పణ కార్యక్రమం ఉంటుందన్నారు. అదే రోజు అమ్మవారి ఊరేగింపు కొనసాగుతుందన్నారు. 13న ఉదయం వసంతోత్సవం, సాయంత్రం సహస్ర దీపాలంకరణ ఉంటుందన్నారు. 14న ఉదయం 9 గంటలకు మహానైవేద్యం సమర్పణ ఉంటుందని వివరించారు.

యూత్ కాంగ్రెస్ కో-ఆర్డినేటర్ నియామకం


విజయ్ సుశీల్ కుమార్

కడప వైఎస్ఆర్ సర్కిల్: ఏపీ యువజన కాంగ్రెస్ యూత్ రాష్ట్ర కో-ఆర్డినేటర్‌గా నంది మండలం విజయ్ సుశీల్ కుమార్‌ను అధిష్టానం నియమించిందని డీసీసీ అధ్యక్షుడు నీలి శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ పార్టీని పటిష్టం చేసేందుకు చేపట్టిన 'యూత్ జోడో బూత్ జోడో' కార్యక్రమం విజయవంతం చేసేందుకు కృషి చేయా లని పేర్కొన్నారు. దేశంలో బీజేపీ వ్యతిరేక విధానాలపై యువతను సమన్వయం చేసి బూత్ కమిటీలు పటిష్టం చేస్తామని తెలిపారు.

బీజేపీతో పొత్తు సిగ్గు చేటు

కడప వైఎస్ఆర్ సర్కిల్: కేంద్రంలోని బీజేపీతో పొత్తుకు టీడీపీ ఆరాట పడుతుండడం సిగ్గుచేటని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ విమర్శించారు. శుక్రవారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో ఆయన మాట్లాడారు. మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి చేసిన అన్యాయాలు, వివక్ష పూరిత విధానాలు వ్యతిరేకంగా పోరాడాల్సింది పోయి జట్టు కట్టడానికి పోటీ పడ్డం దారుణమన్నారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులు, పోలవరం ప్రాజెక్టు, విశాఖ ఉక్కు పరిశ్రమ వంటి విషయాల్లో కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం పోరాడాలన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు ద్రోహం చేస్తున్నా టీడీపీ, జనసేన పార్టీలు బీజేపీ అవకాశవాద పొత్తుల కోసం ప్రయత్నాలు చేయడం సిగ్గుచేటన్నారు. కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై ఈ నెల 14 నుంచి 30వ తేదీ వరకు సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో ప్రచార యాత్రలు చేపడతామని వివరించారు.

వైభవంగా హుస్సేన్‌వలి ఉరుసు

దువ్వూరు : మండల పరిధిలోని మీర్జఖాన్‌పల్లె గ్రామంలో వెలసిన హుస్సేన్‌వలి ఉరుసును శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఉరుసు సందర్భంగా ఎద్దులకు బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి తిలకించారు. మొదటి బహుమతి రూ.40వేలు కమలాపురం మండలం జంగంపల్లె గ్రామానికి చెందిన పుత్తా నాగసుబ్బారెడ్డి ఎద్దులు గెలుపొందగా, రెండో బహుమతి రూ.30వేలు ప్రొద్దుటూరు మండలం ఖాదర్‌బాద్ గ్రామానికి చెందిన సిద్ధారెడ్డి, నాగసుబ్బారెడ్డి ఎద్దులు గెలుపొందాయి. మూడో బహుమతి రూ.20వేలు మైదుకూరు మండలం పోతిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన వరలక్ష్మి ఎద్దులు, నాలుగో బహుమతి రూ.11వేలు వల్లూరు మండలం పెద్దపుత్త గ్రామానికి చెందిన పుత్తా వెంకటసుబ్బారెడ్డి ఎద్దులు గెలుపొందాయి.

త్యాగాలతో రక్షకుడైన క్రీస్తు

- క్రైస్తవ గురువుల సందేశం
- భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే కార్యక్రమాలు


సీఎస్ఐ చర్చిలో దైవ సందేశం అందజేస్తున్న పాస్టర్ మత్తయ్యబాబు


ప్రార్థనలకు హాజరైన విశ్వాసులు

కడప కల్చరల్ : ప్రభువైన ఏసుక్రీస్తు తన జీవితాన్ని త్యాగం చేసి మానవ లోకానికి రక్షకుడిగా మారాడని పలువురు క్రైస్తవ గురువులు పేర్కొన్నారు. గుడ్‌ఫ్రైడే సందర్భంగా శుక్రవారం పలు చర్చిల సంఘాలు, క్రైస్తవ కమిటీ సభ్యులు, గురువుల ఆధ్వర్యంలో శిలువయాగం కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రైల్వేస్టేషన్ సమీపంలోని ఆరోగ్యమాత పుణ్యక్షేత్రంలో కడప కథోలిక మేత్రాసన కోశాధికారి ఫాదర్ పెండ్లికట్ల దేవరాజు ఆధ్వర్యంలో కల్వరి యాత్ర 14 ఘట్టాల శిలువ మార్గాన్ని నిర్వహించారు. అనంతరం క్రీస్తు ప్రభువు శిలువపై పలికిన ఏడు మాటలను వివరించారు. తనను హింసిస్తున్న వారిని కూడా క్షమించమని తన తండ్రి అయిన దేవుడిని ప్రార్థించిన క్రీస్తు లోకానికి ఆదర్శంగా నిలిచారన్నారు. కార్యక్రమంలో ఆరోగ్యమాత పుణ్యక్షేత్రం డైరెక్టర్ అబ్రహం, సహాయ డైరెక్టర్ ఫాదర్ అనిల్, డాన్‌బాస్కో గురువులు ఫాదర్ జార్జి, ఫాదర్ జ్ఞాన ప్రకాశం, సాగర్, ఆరోగ్యమాత కాన్వెంట్ జనరల్ సుపీరియర్ మదర్ సెల్వి రాయప్పన్, పలువురు సిస్టర్లు, చర్చి కమిటీ పెద్దలు, విశ్వాసులు పాల్గొన్నారు.

ప్రాణాలను సైతం లెక్కచేయక

క్రీస్తు ప్రభువు తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పాపుల రక్షణ కోసం శిలువపై రక్తధారలు చిందించారని సీఎస్ఐ సెంట్రల్ చర్చి పాస్టర్ మత్తయ్యబాబు అన్నారు. గుడ్‌ఫ్రైడే సందర్భంగా శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో ఆయన ప్రధాన వక్తగా మాట్లాడారు. మానవుల పాపాలను తుడిచి పెట్టేందుకే క్రీస్తు మానవుడిగా ఈ లోకానికి వచ్చారని తెలిపారు. మానవతావాదిగా ఆయన శిలువపై నుంచి చెప్పిన ఏడు మాటల అర్థాన్ని కూడా వివరించారు. భక్తులచే వాక్య పరిచర్య చేయించారు.

మరియాపురంలో ...

స్థానిక మరియాపురంలో గుడ్‌ఫ్రైడేని పురస్కరించుకుని భక్తులైన విశ్వాసులు, మేత గురువులు, స్థానిక క్రైస్తవ ప్రముఖులు శిలువ యాగం ర్యాలీ నిర్వహించారు. న్యూ నేటివ్ కృపా ప్రార్థనా మందిరంలో దైవ జనులు మహేష్, సిస్టర్ శాంతమ్మ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. రవితేజ, రోజా, శాంతిరాజు, అంజలి తదితరులు పాల్గొన్నారు.

పానకం పంపిణీ

కడప కార్పొరేషన్: సర్వమానవాళి రక్షణ కోసం యేసుక్రీస్తు ప్రాణత్యాగం చేశారని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా, మేయర్ సురేష్ బాబు తెలిపారు. గుడ్‌ఫ్రైడే సందర్భంగా శుక్రవారం స్థానిక మాసాపేటలో రక్షణ సంస్థ అధ్యక్షులు పి. సంపత్ కుమార్ ఆధ్వర్యంలో పానకం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీస్తు అనగానే క్షమ, కరుణ వంటి గుణాలు గుర్తుకు వస్తాయన్నారు. ఉపవాసం ఉంటూ దేవుని ఆరాధించే వారికి పానకం పంపిణీ చేయడం పుణ్యకార్యమన్నారు. ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పులి సునీల్ కుమార్, సీహెచ్ వినోద్‌కుమార్, త్యాగరాజు, బంగారు నాగయ్య, చైతల్య, సుబ్బారెడ్డి, షఫీ పాల్గొన్నారు.



ప్రేమ విందు

కడప కార్పొరేషన్: స్థానిక సీఎస్ఐ సెంట్రల్ చర్చిలో వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి. చిట్టిబాబు ఆధ్వర్యంలో భక్తులకు ప్రేమ విందు ఏర్పాటు చేశారు. 40 రోజులు దుఃఖ దినాలు గడిపి గుడ్‌ఫ్రైడే రోజు ప్రేమ విందులో పాల్గొన్నందుకు సంతోషంగా ఉందన్నారు. 11 ఏళ్లుగా భక్తులకు ప్రేమ విందు ఇచ్చే అవకాశం కల్పించినందుకు దేవునికి వందనాలు తెలిపారు.

కమిటీలు వద్దు.. రద్దే ముద్దు

కడప ఎడ్యుకేషన్: సీపీఎస్‌పై కమిటీలు వేయకుండా రద్దు చేసి ప్రభుత్వ ఉద్యోగులకు బాసటగా నిలవాలని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వ ఉద్యోగుల పింఛను పథక పరిశీలన కోసం కేంద్ర ప్రభుత్వం కమిటీ వేసిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఎస్ రద్దు చేసి పాత పింఛన్ పథకాన్ని అమలు చేయాల్సిందిగా కొన్నేళ్లుగా ఉద్యోగులు ఆందోళన చేస్తున్నారన్నారు. ఉద్యోగుల కోరిక మేరకు ఇప్పటికే పలు రాష్ట్రాలు పాత పింఛన్ పథకాన్ని అమలు చేశాయని గుర్తు చేశారు.

భక్తిశ్రద్ధలతో ఇఫ్తార్

కడప వైఎస్ఆర్ సర్కిల్ : రంజాన్ ఎంతో పవిత్రమైన మాసమని డీవైఎఫ్ఐ, ఆవాజ్ నగర కార్యదర్శులుఓబులేశు, రియాజ్ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని సాయిపేటలోగల తిమ్మర్‌జీ మసీదులో డీవైఎఫ్ఐ,ఆవాజ్ నగర కమిటీ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ, ఆవాజ్ నాయకులు విజయ్‌భాస్కర్, శివ, అబ్దుల్ రఫీ, ఆరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దోమతెరలు అందజేత

కడప కల్చరల్ : కడప నగరం ప్రకాశ్‌నగర్‌లోని అర్బన్ బాయిస్ హాస్టల్‌లో శుక్రవారం మోరంరెడ్డి బుచ్చిరామిరెడ్డి ఎడ్యుకేషనల్ ట్రస్టు ఆధ్వర్యంలో దోమతెరలు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సాంఘికసంక్షేమశాఖ అధికారి డాక్టర్ వల్లూరు బ్రహ్మయ్య మాట్లాడుతూ బాల్యం ఆరోగ్యంగా సాగినప్పుడే వారి భవిష్యత్తు బాగుంటుందన్నారు. ప్రొద్దుటూరు జీఎస్టీ సర్కిల్-1 అసిస్టెంట్ కమిషనర్ మోరంరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి వీటిని బహూకరించారు. కార్యక్రమంలో కొండూరు జనార్దన్‌రాజు, కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

16న పాలిసెట్, ఏపీఆర్‌జేసీ ఉచిత శిక్షణ

పులివెందుల టౌన్ : పదవ తరగతి పరీక్షల అనంతరం పాలిసెట్, ఏపీఆర్‌జేసీ-2023 ప్రవేశ పరీక్షలకు పులివెందుల పట్టణంలోని పాత సత్రంబడి పాఠశాలలో స్నేహిత అమృత హస్తం సేవాసమితి ఆధ్వర్యంలో ఉచిత విద్య ఉపాధ్యాయ బృందం వారి సహకారంతో ఈనెల 16వ తేదీ నుంచి ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభించనున్నట్లు సేవా సమితి అధ్యక్షుడు రాజు తెలిపారు. శిక్షణ తరగతులకు సంబంధించిన కరపత్రాలను వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు 10వ తరగతి హాల్ టికెట్, ఆధార్ జిరాక్స్ తీసుకుని తల్లిదండ్రులతోపాటు వచ్చి ఉచిత శిక్షణ ప్రవేశం పొందాలన్నారు. పులివెందుల ప్రాంత గ్రామీణ, పట్టణ పరిధిలోని విద్యార్థిని, విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 9966509364, 9866727534 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఘనంగా కంకణ మహోత్సవం

సింహాద్రిపురం : అంకాలమ్మగూడూరులో వెలసిన అంకాలమ్మతల్లి తిరునాల సందర్భంగా గురువారం రాత్రి కంకణ దారణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారికి కంకణం కట్టి తిరునాలకు అంకురార్పణ చేశారు. అలాగే అంకాలమ్మతల్లి జాతర సందర్భంగా ఈనెల 16వ తేదీన ఎద్దులచే బండలాగుడు పోటీలను నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ అశోక్‌రెడ్డి తెలిపారు. మొదటి బహుమతి రూ.90వేలు, రెండవ రూ.80వేలు, మూడు నుంచి తొమ్మిది వరకు నగదు బహుమతులుంటాయన్నారు. మరిన్ని వివరాలకు 6309833011, 8919189323 నెంబర్లను సంప్రదించాలన్నారు.

అక్షరజ్ఞానంతో అభివృద్ధే లక్ష్యంగా పల్లెనిద్ర

ప్రొద్దుటూరు క్రైం : అక్షర జ్ఞానంతో అభివృద్ధే లక్ష్యంగా మాదిగల ఆత్మగౌరవ పల్లెనిద్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి సువర్ణరాజు తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఆయన ప్రొద్దుటూరుకు విచ్చేశారు. ముందుగా పాతబస్టాండులోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం కొర్రపాడు రోడ్డులోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో 5 రోజుల పాటు పల్లెలన్నీ పర్యటించామన్నారు. మాదిగలకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రతి గ్రామాన్ని తిరిగి వివరిస్తున్నామని చెప్పారు. మాదిగలు ఉన్నత శిఖరాలను చేరుకోవాలనే లక్ష్యంతో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని పల్లెలను సందర్శిస్తున్నామని తెలిపారు. అనంతరం అమృతానగర్‌లోని 11వ వీధిలో పల్లెనిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు కోలాప్రసాద్, వేకూరి విజయ్ కుమార్, దూదేకుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పగిడేల దస్తగిరి, సంచార జాతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పసుపులేటి శివకృష్ణ, కొండయ్య, మారెయ్య, ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి అమ్మలదిన్నె సుధాకర్ పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే

కమలాపురం : మండలంలోని తదితర గ్రామాల్లో క్రైస్తవులు భక్తి శ్రద్ధలతో గుడ్ ఫ్రైడే వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించుకున్నారు. కమలాపురంలో వెలసిన ఆర్‌సీఎం, సీఎస్ఐ, టీసీసీ టౌన్ చర్చి, రహెబోతు, మన్నా, యెరూషలేము, టౌన్ చర్చి (రాంనగర్) తదితర చర్చిలలో శుక్రవారం పాస్టర్ల ఆధ్వర్యంలో ప్రార్థనలు నిర్వహించారు. సీఎస్ఐ చర్చి పాస్టర్ భరత్ హెరాల్డ్ ఆధ్వర్యంలో యువకులు క్రీస్తు శిలువయాగం చేశారు. అలాగే తదితర చర్చిల పాస్టర్లు కూడా శిలువయాగం చేశారు. అనంతరం క్రీస్తును స్మరించుకుంటూ గీతాలు ఆలపించారు.


కమలాపురంలో శిలువయాగంలో పాల్గొన్న విశ్వాసులు

చెన్నూరు: మండలంలోని వివిధ చర్చిలలో గుడ్‌ఫ్రైడే సందర్భంగా శుక్రవారం క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అలాగే స్థానిక చర్చిలో ఫాదర్ పీటర్ ప్రభాకర్ ఏసు ప్రభువు సందేశాన్ని వినిపించారు. అనంతరం క్రీస్తు శిలువయాగాన్ని నిర్వహించారు. క్రైస్తవ పెద్దలు, విశ్వాసులు పాల్గొన్నారు.

వల్లూరు : మండలంలో క్రైస్తవులు శుక్రవారం గుడ్‌ఫ్రైడే సందర్భంగా పలు గ్రామాలలోని చర్చిలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పైడికాలువలోని ఆర్‌సీఎం చర్చిలో ఫాదర్ చిన్నప్ప ఆధ్వర్యంలో శిలువ మార్గం కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం 49 రోజులుగా చేస్తున్న ఉపవాస దీక్షలను విరమించారు.

శారీరక శ్రమతోనే ఆరోగ్యం

ప్రొద్దుటూరు క్రైం : ఆహారపు అలవాట్లతో పాటు శారీరక శ్రమ చేయడం వల్ల మనం ఆరోగ్యంగా ఉండగలుగుతామని కల్లూరు పీహెచ్‌సీ వైద్యాధికారి బద్వేలి శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. ప్రపంచ ఆరోగ్య దినం సందర్భంగా శుక్రవారం సర్వోదయ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో బుడ్డాయపల్లె బీసీ బాలికల కళాశాల వసతి గృహంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ అందరికీ ఆరోగ్యం అనే నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి దీని ప్రాముఖ్యత గురించి వివరించాలన్నారు. అనంతరం వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సిర్డ్ సొసైటీ అధ్యక్షుడు ఎంవీ సుబ్బారెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు, సబ్ యూనిట్ అధికారి సాధు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న ఆస్పత్రి అధికారులు, సిబ్బంది

కామనూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో..

ప్రపంచ ఆరోగ్య దినం సందర్భంగా కామనూరు పీహెచ్‌సీ పరిధిలోని గోపవరంలో డాక్టర్ హనీఫ్‌బాబా ఆధ్వర్యంలో వైద్యాధికారులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. నడక, యోగా ప్రాముఖ్యత గురించి ప్రజలకు వివరించారు. హెల్త్ ఎడ్యుకేటర్ శోభారాణి, సూపర్‌వైజర్ వరప్రసాద్ పాల్గొన్నారు.

పెండింగ్‌లో ఉన్న డీఏలను ప్రకటించాలి

ప్రొద్దుటూరు : పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే ప్రకటించాలని ఎస్టీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరాజు యాదవ్ తెలిపారు. స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ ఆవరణలో శుక్రవారం నిర్వహించిన మండల స్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ఎస్టీఎఫ్ ముందుంటుందన్నారు. మున్సిపల్ సర్వీసు రూల్స్‌లో ఉపాధ్యాయులకు అన్యాయం జరగకుండా పదోన్నతులు, బదిలీలు జరపాలని, గురుకుల, కస్తూర్బా పాఠశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్‌ఉద్యోగులకు పదవీవిరమణ వయసు 62 ఏళ్లకు పెంచాలని కోరారు.

వైభవంగా చెన్నకేశవస్వామి రథోత్సవం

బద్వేలు అర్బన్ : మున్సిపాలిటీ పరిధిలోని చెన్నంపల్లె గ్రామంలో శ్రీదేవి, భూదేవి సమేత ఆదిచెన్నకేశవస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం నిర్వహించిన స్వామి రథోత్సవం వైభవంగా జరిగింది. రథోత్సవంలో ఆలయ కమిటీ వారు భక్తుల సౌకర్యార్థం తాగునీటి వసతి, చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. అనంతరం భక్తుల దర్శనం కోసం స్వామివారిని రథంపై నుంచి కిందకు దించి గ్రామోత్సవం నిర్వహించారు.

బండలాగుడు పోటీలు :

పోటీలను మున్సిపల్ చైర్మన్ వాకమళ్ళ రాజగోపాల్‌రెడ్డి ప్రారంభించారు. ఈ పోటీల్లో మొదటి బహుమతిని చియ్యపాడు గ్రామానికి చెందిన అనూషరాణి వృషభాలు కై వసం చేసుకోగా వీరికి రూ.40,116లు, ద్వితీయ బహుమతిని గోపవరం మండలానికి చెందిన నెమలయ్య వృషభాలు రూ.20,116లు, తృతీయ బహుమతిని నంద్యాల జిల్లా రోళ్ళపాడు గ్రామానికి చెందిన ప్రభాకర్‌రెడ్డి వృషభాలు రూ.10,116లు బహుమతిగా అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ రంగారెడ్డి, నిర్వాహకులు సానపురెడ్డి మనోహర్ రెడ్డి, ఆలయ బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

'జగనన్నే మా భవిష్యత్' సర్వేకు సహకరించండి

- ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, చిత్రంలో మేయర్ తదితరులు

కడప కార్పొరేషన్: 'మా నమ్మకం నువ్వే జగన్'నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు చేపట్టిన 'జగనన్నే మా భవిష్యత్'కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రజలు సహకరించాలని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా కోరారు. శుక్రవారం స్థానిక 27వ డివిజన్‌లోని గౌస్ నగర్‌లో ఆయన ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి, మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 1.60 కోట్ల ఇళ్లకు చేరేలా భారీ కార్యక్రమాన్ని రూపొందించారన్నారు. ఈనెల 7 నుంచి 20వ తేదీ వరకు సాగనున్న ఈ సర్వే ద్వారా తమ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ఇంటింటికీ వచ్చి గత టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు అలవిగాని హామీలిచ్చి ప్రజలను ఎలా మోసం చేసింది, ప్రస్తుత ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో 98.5 శాతం అమలు చేసి ప్రజలకు ఎలా మేలు చేసిందో వివరిస్తారన్నారు. కులమత, వర్గ, పార్టీలతో ప్రమేయం లేకుండా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అత్యంత పారదర్శకంగా ఇంటివద్దకే చేరుస్తున్నామన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పథకాలను వివరించి, పథకాల వివరాలతో కూడిన కరపత్రం అందజేసి, స్టిక్కర్ అతికిస్తారని తెలిపారు. ప్రజలు సంతృప్తి చెందితేనే ఆశీర్వదించమని కోరిన ఒకే ఒక్క నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని తెలిపారు. కడప నగరంలో 5001 మంది సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు 95 వేల గృహాలను సందర్శించి సర్వే చేస్తారన్నారు. తద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 4.05లక్షల మందిని కలుసుకొని వారితో మమేకం అవుతారన్నారు.మేయర్ సురేష్‌బాబు మాట్లాడుతూ 2014కు ముందు 600కు పైగా ఉచిత హామీలిచ్చిన చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క హామీ కూడా నెరవేర్చకుండా ప్రజలను దారుణంగా మోసం చేశారన్నారు. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసిందన్నారు. అంతకుముందు వారు «మా నమ్మకం నువ్వే జగన్»పోస్టర్లను, స్టిక్కర్లను ఆవిష్కరించారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే మా మద్దతు

అనంతరం డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ సురేష్ బాబులు సర్వేకు సంబంధించిన సంచిని భుజానికి తగిలించుకొని ఇంటింటికీ వెళ్లి గత ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వానికి ఉన్న తేడాను వివరించి, వారిని ఐదు ప్రశ్నలను అడిగి వాటికి సమాధానాలు రాబట్టారు. మీరు ఏ ప్రభుత్వానికి మద్దతు ఇస్తారని డిప్యూటీ సీఎం ప్రశ్నించగా వారు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే అని తేల్చి చెప్పారు. అనంతరం వారి మొబైల్స్‌కు, ఇళ్లకు స్టిక్కర్లు అతికించారు. ఆ తర్వాత వారి సెల్‌ఫోన్‌తో మిస్డ్‌కాల్ ఇప్పించారు. ఈ కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, ఏపీ సోషల్‌వెల్ఫేర్ బోర్డు చైర్మెన్ పులి సునీల్ కుమార్, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మెన్ యానాదయ్య, డిప్యూటీ మేయర్ ముంతాజ్ బేగం, కో ఆప్షన్ సభ్యుడు ఎస్ఎండీ జహీర్, పార్టీ నాయకులు జయచంద్రారెడ్డి, బండి ప్రసాద్, వి.నాగేంద్రారెడ్డి, జమాల్‌వలీ, బాలక్రిష్ణారెడ్డి, పత్తిరాజేశ్వరి, రత్నకుమారి, టీపీ వెంకట సుబ్బమ్మ, ఉమామహేశ్వరి పాల్గొన్నారు.


ఏపీహెచ్‌బీ కాలనీలో సర్వే నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీరంజన్‌రెడ్డి తదితరులు

వైఎస్ జగన్‌కే ప్రజల మద్దతు

కడప కార్పొరేషన్: ప్రజలందరి మద్దతు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే ఉందని 20వ డివిజన్ కార్పొరేటర్ వై. మాధవి, డివిజన్ ఇన్‌చార్జి శ్రీరంజన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం వారు 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమంలో భాగంగా ఏపీహెచ్‌బీ కాలనీలోని పలు ఇళ్లకు వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన మంచి కార్యక్రమాలను, గత ప్రభుత్వం హామీలిచ్చి మోసం చేసిన వైనాన్ని వివరించారు. అనంతరం వారికి ఫోన్‌లకు, ఇళ్లకు స్టిక్కర్లు అంటించి, మిస్డ్‌కాల్ ఇప్పించారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

కార్యకర్తలే పార్టీకి బలం

- కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుంది
- ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి


స్టిక్కర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి, మల్లికార్జున రెడ్డి తదితరులు

చింతకొమ్మదిన్నె : వచ్చే ఎన్నికల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెచ్చేందుకు మనమందరం కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రాయచోటి రోడ్డులోని రాజారాణి మహల్ ఫంక్షన్ హాల్‌లో జగనన్నే మా భవిష్యత్, మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని కమలాపురం, చింతకొమ్మదిన్నె, వల్లూరు, పెండ్లిమర్రి, చెన్నూరు, వీఎన్‌పల్లి మండలాలతో పాటు కడప అర్బన్ పరిధిలోని 85 సచివాలయాల కన్వీనర్లు, నాయకులు, గృహసారథులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో మన పార్టీ అధికారంలోకి వస్తే కార్యకర్తలకు మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి టీడీపీ చేసిన అరాచకాలు, మన ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించి గత ప్రభుత్వానికి మన ప్రభుత్వానికి ఉన్న తేడాను ప్రజలు గుర్తించేలా పనిచేయాలన్నారు. అలాగే జగనన్నకు మద్దతుగా 82960 82960 నెంబర్‌కు మిస్డ్ కాల్ చేయాలన్నారు. ఏ ఒక్క కార్యకర్తను వదులుకోను అని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించడంతో ప్రతి కార్యకర్తకు త్వరలోనే మేలు జరుగుతుందన్నారు. జేసీఎస్ రీజనల్ కో ఆర్డినేటర్ చల్లా మధుసుదన్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ ప్రతి కార్యకర్తను గుర్తుంచుకుంటుందన్నారు. ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ దుగ్గాయపల్లి మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ సంతోషంగా ఉంటేనే పార్టీకి ప్రత్యేక స్థానం ఉంటుందన్నారు. కార్యక్రమంలో సీకేదిన్నె జెట్పీటీసీ పి.నరేన్ రామాంజులు రెడ్డి, డిప్యూటీ మేయర్ బండి నిత్యానందరెడ్డి, రాష్ట్ర సోషల్ వెల్ఫేర్ చైర్మన్ పులి సునీల్‌కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్‌పీఎస్ఆర్, జెట్పీ వైస్ చైర్మన్ పిట్టు బాలయ్యయాదవ్, మండల కన్వీనర్లు గూడా ప్రభాకర్‌రెడ్డి, అబ్బిరెడ్డి వీరారెడ్డి, ఉత్తమారెడ్డి, పుల్లారెడ్డి, జీఎన్ భాస్కర్‌రెడ్డి, రఘునాథ్ రెడ్డి, మాచునూరు చంద్రారెడ్డి, గుత్తిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కో కన్వీనర్ కళాయాదవ్ కార్పొరేటర్ చంద్రహాస్‌రెడ్డి, ఏపీ ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్ కృష్ణయ్య, జెట్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌కు కొత్త కళ

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరులోని త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో నిర్మించిన నూతన భవన సముదాయాన్ని అడిషనల్ ఎస్పీ తుషార్ డూడీ, ఏఎస్పీ ప్రేరణాకుమార్ శుక్రవారం ప్రారంభించారు. త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్ భవనాలు శిథిలావస్థకు చేరుకోవడంతో ఇటీవల అధికారులు కూల్చేశారు. వాటి స్థానంలో నూతన సీఐ, ఎస్ఐ చాంబర్లతో పాటు రిసెప్షన్ విభాగాలను ఏర్పాటు చేశారు. మైదానంలో కూడా వివిధ రకాల మొక్కలను నాటి ఆహ్లాదంగా తీర్చిదిద్దారు. రెండు చాంబర్లతో పాటు రిసెప్షన్ విభాగాలను అడిషనల్ ఎస్పీ, ఏఎస్పీలు ప్రారంభించారు. అలాగే స్టేషన్ ప్రాంగణంలో మొక్కలను నాటారు. సీఐలు నారాయణయాదవ్, ఇబ్రహీం, యుగంధర్, ఎస్ఐలు కృష్ణంరాజునాయక్, హైమావతి, తిమోతి, రాజగోపాల్, కౌన్సిలర్లు గరిశపాటి లక్ష్మీదేవి, వరికూటి ఓబుళరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గడ్డి వాములు దగ్ధం

బ్రహ్మంగారిమఠం: మండలంలోని సోమిరెడ్డిపల్లె గ్రామంలో శుక్రవారం నాలుగు గడ్డి వాములు దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో రూ. లక్ష నష్టం వాటిల్లినట్లు బాధితులు యత్తపు వెంకటసుబ్బారెడ్డి, రమణారెడ్డి, తులసమ్మ వాపోయారు. బద్వేల్ ఫైర్ స్టేషన్ అధికారులు వచ్చి మంటలను ఆర్పేసరికి గడ్డి వాములు పూర్తిగా కాలిపోయాయని తెలిపారు.

ఘనంగా అంకాలమ్మ తిరునాల

పెండ్లిమర్రి : మండలంలోని రంపతాడు గ్రామంలో వెలసిన అంకాలమ్మ తిరునాల ఉత్సవాలు శుక్రవారం ఆలయ నిర్వాహకులు వైభవంగా నిర్వహించారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం బండలాగుడు పోటీలను నిర్వహించి బహుమతులు అందజేశారు.